ఏడవ మెట్టు

శ్రీమతి ఎచ్. కావేరిబాయి గారు, బి. ఎ; యల్. టి.

౧

దేహారోగ్యమైనను, వ్యాధిగ్రస్తమైనను, మనస్సుయొక్క స్థితి ననుసరించి యుండును. వైద్యు లనేకులు శరీరసంబంధమైన చిహ్నములను బట్టి రోగచికిత్స చేయుదురు. నాపద్ధతి యేమనగా ముఖలక్షణములను చూచి, వ్యాధికి మూలకారణమును, తెలిసికొనుట.

ఎచ్. కావేరిబాయి గారు

నాకు లండన్ నగరమందు గొప్ప ప్రాక్టీస్ (Practice) కలదు. అనేకులు దినదినము రోగనివారణ నిమిత్తము, నాయొద్దకు వచ్చుటచే నొకనాడైనను నాకు విశ్రాంతికలుగుట కాస్పదము లేకుండెను. ఇట్లు పెక్కుకాలము గతించినపిమ్మట కొంత విశ్రమము పొందినంగాని నాదేహారోగ్యము నశించునని, భయపడితిని. లండన్ నగరమందు నాకు నిశ్చింత యుండదని తలచి యూరప్ ఖండములోని యితర స్థలములను చూడవలెనని నిశ్చయించితిని. ఇట్లుండ మనోహర విహారార్థమై ప్రయాణము చేయువారికి యేర్పాట్లు కలిగిన నావయొకటి బయలుదేరుటకు సిద్ధముగా నుండెను. ఆయోడలో నాకొక స్థలము నేర్పాటుచేసికొంటిని.

మేము బయలుదేరి యుత్తరసముద్రముమీద ప్రయాణము చేయుచుండగా కెరటములు, తుపానులచే పడవ యధికముగా నూగుచుండెను. సముద్రవ్యాధిచే పీడితులమై మేము మాక్యాబిన్ (Cabin) లను వదలకుంటిమి. పిమ్మట బాల్టిక్ (Baltic) ప్రవేశింపగానే నార్వే (Norway) తీరపు చీలికల, ద్వీపములమధ్య సముద్రము సరోవరమువలె నునుపుగానుండెను. హాయిగా నుండుటచేత క్యాబినులనుండి డెక్ (Deck) మీదకు వచ్చి తిరుగుచుంటిమి. మాతోడి ప్రయాణికు లెవ్వరెవ్వరో చూచుకొనుచు; సముద్రమును, ద్వీపములను, నార్వేతీరమును, పరీక్షించుచు కాలము గడుపుచుంటిమి.

ఒక క్యాబిన్‌నుండి యొక మంచము మోసికొని రాబడెను. ఆ మంచముమీద మిక్కిలి సౌందర్యవతియై పందొమ్మిదియేండ్ల వయసుగల బాలిక యొకర్తు రోగివలె పడియుండెను. నడుమునకు క్రిందకు

యువతిశరీరము కప్పబడియుండెను. ఆమెను మోసికొనివచ్చి యామెకుపచారములు చేయుచుండిన స్త్రీ యొక ఇంగ్లీష్ రెడ్ క్రాస్ నర్స్ (English Red Cross nurse) వలెనుండెను. ఈమెయందు కళావిహీనత కలిగియుండుటయేకాక ముఖము ముడుచుకొన్నట్లుకూడ కనబడెను. బాలిక యెవరిని గమనింపక నీటివంక చూచుచుండెను. నేను కొంతయాగి రోగివైపుచూచితిని. అనేకు లట్లే చేసిరి. దాది నావంక క్షణమాత్రము చూచెను. అయితే నాచూపునందు కారణములేని పగయు, క్రోధమును కనబడెను. నేను నడచుట మరల నారంభించితిని. చీకటిపడగానే రోగిని దాది లోనికి కొనిపోయెను.

రెండవదినముకూడ చల్లనిగాలి కొరకు డెక్ మీదకు సాయంసమయమున వస్తిమి. రోగిని, దాది మంచము మీద తీసికొనివచ్చెను. వారు తెలిసికొనకుండునట్లు నేను షికారు చేయుచు వారిని గమనించుచుంటిని. గులాబివన్నెగౌను తొడుగుటవలన బాలికరూపవిలాసములు మరింత తేజరిల్లుచుండెను. ఆమె యెప్పటి వలెనే పెడమొగముగా పరుండి యుండెను. అటు నిటు షికారుచేయుచు నామె సమీపమున నొకగడియ నిలిచితిని. ఏదో వస్తువు తెచ్చుటకై దాది యామెను విడిచి వెళ్లియుండెను. రోగి చటుక్కున నావంకకుతిరిగి యిట్లనెను:

"డాక్టర్‌గారు! మీతో నొకరహస్యము చెప్పవలెను. నన్ను మీరు పరీక్షించెదరా?"

"అమ్మా! నావకుచెందిన వైద్యులు మిమ్మును కనిపెట్టుచుండగా నన్నుపిలుచుట మంచిదా?" యంటిని.

"ఎందుచేత మీరు నాకు చికిత్సచేయరాదు?" అని ఆమె అనెను.

"అది ప్రొఫెషనల్ ఎటిక్వెట్ కాదం"టిని.

"ప్రొఫెషనల్ ఎటిక్వెట్ (Professional etiquette) అను దానినొకటి గట్టిగా పట్టుకొని మీ డాక్టర్లు మనస్సాక్షిలేనివారై యున్నారు. వ్యాధిగ్రస్తురాలైన యొక బీదబాలిక బాధయెట్లున్నను సరే, మీరు చూడకూడదా?"

"అమ్మా! నేనట్లు చేయరాదు. అయితే మిమ్మును చూచుచున్న వైద్యులు నాసహాయము కోరిన యెడల నేను వారికి సలహా నిచ్చెదను. కాని మీకేస్ (Case) నేను తీయకూడదు."

"వారు కోరి పిలవిచ్చినయెడల నన్ను పరీక్షించెదరా?" యని మరలనడిగెను.

"వారు నాకు పిలవిచ్చి, నాతో నుండవలె"నంటిని.

"లేదు, మిమ్ములను నేను వంటరిగా చూడవలెను."

ఇట్లు చెప్పునంతలో నర్సుతిరిగివచ్చుచుండెను.

"ఆమెను గురించి మీరు బహుజాగ్రతగా నుండవలెను. ఆమెకు తెలియని సంగతులుగాని, యామె కనిపెట్టని విషయములుకాని లేవు. మీ రిట్టివారని యామె గ్రహించి యున్న"దని బాలిక యనెను.

దాదివచ్చి పగతోనిండిన చూపుతో నన్నొక్కసారి చూచెను. నేను మరల షికారు మొదలుబెట్టితిని. కొంతసేపైన వెనుక పడవయావత్తు దీపములతో వెలుగుచుండెను. ఓడనాయకుడు, నతని భార్యయు, రోగి చెంత కుర్చీలమీద కూర్చుండి సంభాషించుచుండిరి. నన్ను చూడగనే వారు రోగికి నన్ను పరిచయము (Introduce) చేసిరి.

"మేమిద్దర మిదివరకే కలిసి సంభాషించి యున్నా"మని బాలిక చెప్పెను.

మేమందరము కొంతకాలము కూర్చుండి మాట్లాడినపిమ్మట దాది రోగికి శాలువకప్పి లోపలికి కొనిపోయెను. భోజనమునకు వేళయగుటచేత నందరము చెదరిపోతిమి. నేను నాక్యాబిన్‌లోకి వెళ్లి వస్త్రములు

మార్చుకొని భోజనస్థలమునకు పోవుచుంటిని. దారిలో రోగిగది దాటవలసి వచ్చెను. అచ్చటికి వచ్చినప్పుడు గాజువస్తువు వేస్ (Vase) వంటిదేదో క్రిందబడి పెళ్లుమని పగిలిన శబ్దమువింటిని. అందుచే నొకింత తలుపు చెంత నిలిచితిని. ఎవరో యటు నిటు పరుగిడుటయు వెలుపల నొకరు నిలిచినట్లు గ్రహించి యిష్టపడక తలుపుసందులలో నుండి నన్ను చూచినట్లును తెలిసికొని నేను సాగిపోతిని. భోజనశాలకు వెళ్లుటకు నేను మెట్లు దిగుచుండగా రోగియాహారమును పళ్లెములో పెట్టుకొని దాది మెట్లెక్కుచుండెను. అచ్చట మేమెదురుపడిన వెంటనే నన్నామె కన్నెఱ్ఱజేసి చూచెను.

భోజనము ముగిసినపిమ్మట పడుకొనుటకు పూర్వము చల్లనిగాలి ననుభవించుచు కొంతమంది డెక్ మీదనుంటిమి. నేను కట కటాలకు పట్టుకొని నిలిచి చీకట్లు క్రమ్మిన నీటిని, ఆ కాశమును చూచు చుంటిని.

"ఏమండోయి! నేను లేకనుండ, మా వెంటరాకుండ మీరు వ్యాధిగ్రస్థురాలిని చూడనన్నారట కదా?" యని యోడ వైద్యుడడిగెను.

"అది వాస్తవమే" యంటిని.

"మా మీద గట్టి విశ్వాసమేదో యొకటి యామెకు కలదు. పోనీ యామె కోరిక తీర్చరాదా?" యనెను.

"మీ వెంటవచ్చి రోగిని చూచుటకు నాకభ్యంతరములే" దంటిని.

"రెండవ వారెవరు నుండరాదట. మీరు వంటరిగా వెళ్లవలెనట. నా ప్రార్థనవిని మీరామెను తృప్తిపరచుదురుగాక" యని వైద్యుడు చెప్పెను.

"అందుకు నేను సమ్మతింప"నని జవాబుచెప్పి ఆమెకేమి జబ్బంటారు?"అని ప్రశ్నించితిని.

"కాళ్లు పడిపోయినవి."

"అది కుదురునా?" యంటిని.

"నాకేమియు నమ్మకము లేదు."

"అయితే మీ బ్యాటరీ (Battery) నాకు వాడుకొనుటకు, దయచేసినయెడల నేనామెను పరీక్షించెదను."

౨

అమరునాటి యుదయమున, దాది నాయొద్దకు వచ్చి, "మీ రాకకు రోగి సిద్ధపడియున్న" దనెను.

నేను బ్యాటరీ పట్టుకొని బాలిక గదిలోనికివెళ్లితిని. నర్సచ్చటికో క్యాబిన్ నుండి పోవుచుండెను.

"ఒక నర్సయినను లేకుండ నేను మిమ్మును పరీక్షింపను. ఆమెను పిలువండి. బ్యాటరీనైనను నొకరు పట్టుకొనవలె" నని రోగితో నేనంటిని.

"లేదండి నేను మీతో సంభాషించునప్పు డెవరు నుండరాదు. బ్యాటరీ తెచ్చితిరా? అయితే నాకేమి వ్యాధియనెదరు?"

"మీ కేవ్యాధియు లేదు. ఇదంతయు నటన."

"చూచితిరా! ఆమె నిశ్చయముగానే గ్రహించినది. ఓడమీదనున్నవారందరు నాకు జబ్బని నమ్మిరి. మొట్ట మొదటలోనే మీరు షికారుచేయుచు నావంక చూచునప్పుడు మీరుమట్టుకు సందేహపడి నట్లు మా దాది గ్రహించినది. ఆమె సామాన్యురాలు కాదు. మీరు జాగ్రతపడవలెను. మీరు నిజముగా

నా గుట్టు తెలిసికొంటిరో లేక మే మూరికే యనుమానపడితిమో తేల్చుటకు మిమ్ములను వంటరిగా రమ్మ నుట" యని బాలికచెప్పెను.

"ఈ వేషము, ఈనటనఎందుకు" అని ఆమెనడిగితిని. ఆమె యిట్లుజవాబిచ్చెను.

"మేము రష్యాదేశస్థులము. మా తండ్రి జర్మనీలో గొప్పవర్తకుడు. అతనికిప్పుడున్నది రెండవభార్య. నా మారుటితల్లి పెట్టుశ్రమల నోర్వలేక మాపెద్దతండ్రి దగ్గరకు తప్పించుకపోవలెనని మార్గము యూహించు చుంటిని. మా పెద్దతండ్రి జారుచక్రవర్తిగారి యాస్థానవైద్యుడు. ఆయ నొకసామంతరాజునకొనవలసినదే. వైద్య శిఖామణియని యాయన కీర్తిప్రపంచకమంతట నిండియున్నది. మీకుకూడ తెలిసియేయుండును. ఆయన కొకగొప్ప లేబొరేటరీ (Laboratory) యున్నది. క్యాన్సర్ (Cancer) వ్యాధికి మూలకారణము తెలిసికొనుటకు క్యాన్స ర్ మైక్రోబ్లను పెంచుచుండును. ఎవరు బాగుచేయలేని రోగము నటించినచో మాపెద్దతండ్రియొద్దకు నన్ను పంపుదురని యూహించి యిట్లు వేషమువేసితిని. జర్మనీలో నెవరికిని నాజబ్బు కుదుర్చుట సాధ్యముకాకుండెను. అందుచేత దాదినిచ్చి నన్ను రష్యాకి వెళ్లుటకై సాగనంపిరి. ఇదిసంగతి."

ఈ చరిత్ర కట్టుకథ నాకు తోచెను. అయిన నామెకోరిక ప్రకారముగా నామె రహస్యము నెవరికి వెల్లడిచేయనని మాటఇచ్చితిని. ఓడవైద్యుడు నన్ను ప్రశ్నించి నప్పుడుకూడ నేదో యొకరీతిగా జవాబులు చెప్పితిని.

మాయోడ చివరకు సెంట్‌పీటర్స్ బర్గ్ (St. Petersburg, now Leningrad) చేరెను. ఎప్పటి వలెనే దిగిపోవువారు ఎక్కెడివారు అడావిడి పడుచుండిరి. ఒకగొప్ప పరివారముతో నొక పెద్ద యధికారివంటి మహాపురుషుడొకడు పడవమీదకు వచ్చుచుండెను. ఆయన బాలికను కలిసికొని ముద్దు పెట్టెను. పరివారపు వారందరు నటునిటు పరుగులిడుచు బాలిక సామానులు ఓడనుండి తీయుచుండిరి. దాది యొకయినుపపెట్టెను బహుజాగ్రతతో మోసికొనివచ్చుచుండెను. కొంతదూరము వచ్చినతరువాత బరువుచేత కాబోలు పెట్టెక్రిందపడి తెరచుకొని యందులోని కాగితములు చెల్లాచెదరుగా పడిపోయెను. ఆమె తొందరగా వానిని తీయుచుండెను. సహాయము చేయవలెనను యూహతో నేను కొన్నికాగిత ములను తీసితిని. తక్షణమే పట్టరాని కోపముతో నాచేతినుండి వానినీడ్చి గట్టిగా లాగుకొని పగతో నిండినచూపు నామీద నొకగడియ నిలిపెను.

ఇనుపపెట్టెలో విలువగల సొమ్ములు లేకుండ కాగితములుండుట యాశ్చర్యముగా నుండెను. మరియు దాది నాదగ్గరనుంచి తీసికొనునంతలో నొక కాగితముమీద బాలికపేరును చూచితిని. ఆమె నాతో చెప్పినపేరదికాదు. దానిమీద "ఓల్గా" అనియుండెను. ఆపత్రములనుగురించి నేనాలోచించు చుండగా రోగి నన్నుపిలిచి తన పెద్దతండ్రికి ఇంట్రడ్యూస్ చేసెను.

ఆమహాపురుషుడు మిక్కిలి సంతసించినవానివలె నన్ను పొగడి యారాత్రి వారిభవనమున విందార గింప కోరెను. నేనెన్నివిధములుగా వెళ్లకుండునట్లు ప్రయత్నించినను వ్యర్థమయ్యెను. బాలికకూడ బ్రతిమాలుచుండెను.

"డాక్టర్ హాలిఫాక్స్‌గారు మీప్రఖ్యాతి నేను వినియుండలేదా? ప్రసిద్ధిగాంచిన వైద్యు లిద్దరు కలిసికొనినప్పుడు—నాయింట మీకు గౌరవముజరుగకతప్పదు. నా లేబొరేటరీని గురించి మీరు వినియే యుందురు. నేను క్యాన్సర్ మైక్రోబ్లను కృషిచేయు పద్ధతి చూచుట కిష్టములేదా?" యనెను.

ఏవైద్యున కిష్టముండదు? నేను సమ్మతించితిని.

395

3

సెంట్ పీటర్స్‌బర్గ్‌లో దిగినవారు కాక నావలోనున్న యితరులుకూడా కొందరు పట్టణమును చూచుటకు వెళ్లితిమి. చీకటి పడకముందు పడవను తిరిగివచ్చి చేరి నేను నాకున్న దుస్తులలో మిక్కిలి విలువగలవానిని ధరించి యా యధికారిభవనమున కేగితిని. ఆమందిరపు వైభవసౌందర్యములను వర్ణింపజాల. అచ్చటి దీపములు, తెరలు, పాన్పులు, తివాసీలు, కుర్చీబల్లలు చూచినయెడల నీజమిందారుడే రష్యా దేశపుచక్రవర్తియా యనునట్లుండెను. నేను వెళ్లునప్పటికి సేవకులు తప్పించి మరెవరును బయట కనబడలేదు. బంగారు జరీతో చేతిపని నలంకరించు ముఖమల్ పరాయి అంగీ తొడగిన సేవకుడొకడు నిశ్శబ్దముగా నన్ను కలిసికొనుటకువచ్చి వంగి నమస్కారముచేసి నన్నొకస్థలమునకు తీసుకవెళ్లి యది నా కొరకు సిద్ధపర్చబడిన గదియనిచెప్పెను. సేవకుని వస్త్రములు నాయంబరములను తిరస్కరించుచున్నట్లుండెను. ఆయింటికిచెందిన స్త్రీపురుషులెట్లు వెలుగుచుందురో వారిమధ్య నేనెట్లు కనబడుదునో కదాయని కొంత సిగ్గుపడితిని. నేనున్న గది యతివిశాలమై నేను శ్రమతీర్చుకొనుటకు కావలసిన, సదుపాయములుకలిగి ప్రక్కన స్నానపుగది (bathroom) సహితముగా నుండెను. నేనొక సోఫామీదకూర్చుండి ఆమందిరములోనున్న విలువగల వస్తువులను చూచుచు చుట్టుకొల్చుచుండగా పట్టుగొను చప్పుడు వినబడెను. ఎచ్చటనుండి వచ్చినదోగాని నా యెదుటమట్టుకు ఓల్గా యొకయప్సరసవలె మోహనీరూపము ధరించి నిలబడి యుండెను. నేనులేచి పలుకరించునంతలో మాట్లాడవలదని నాజ్ఞచేసి యొకజాబును నాచేతిలోపెట్టి దీనిని చదువు మని యదృశ్యమయ్యెను. నేనుజాబును విప్పిచదువగా నిట్లు వ్రాయబడియుండెను.

"ఇతరులకు మా మీద కరుణలేదు. ఇతరులకు దయ యనునది మేముచూపము. నీవు మా రహస్యములను కనిపెట్ట ప్రయత్నించితివి గనుక నీప్రాణములు తీయుచున్నాము. నీకు తప్పించుకొనుటకు మార్గములేదు. ఈ భవనమందే కాక పట్టణమంతట మా గూఢచారులున్నారు. ఈ జమిందారుడు నా పెద్ద తండ్రి కాడు. మేమందరమును జరుగుచున్న పరిపాలన న్యాయచట్టములు మొదలైనవానిని నాశనము చేయుట కేర్పడిన సంఘస్థులము (Nihilists). మాలోనెవ్వరైనా సంఘమును తృప్తిపరచని యెడల వారికి మరణముసిద్ధము. అయితే నీవునాకు చేసిన సహాయముకొరకై నిన్ను తప్పింపవలెనని ధైర్యచిత్తుడవైన యాంగ్లేయుడా! నాయభిలాష. నాకెంత యపాయము వచ్చునో నే నెరుగను. కాని నీకొక్క సలహానిచ్చెదను. నామాటప్రకారము నడిచితివా నీప్రాణములు దక్కవచ్చును. కాని నిశ్చయము మట్టుకు చెప్పలేను.

ఏమాత్రము ధైర్యము విడువకుము. నీయాపద నీవు గ్రహించినట్లేసూచనవల్లనైన వారు తెలిసికొనిరా యేయద్భుత కార్యమైనను నిన్ను రక్షింపజాలదు. కనుక వారందరితో నుల్లాసముగా సంభాషించుచు ముఖమునం దానందము కనపర్చుము. విందుకూటమునందు నాప్రక్కన కూర్చుండి నన్ను వరించువానివలె నాకు రహస్యములు చెప్పుచుండుము. వారు నీతో నేదియన్నను విశ్వసించిన వానివలెనుండుము. నీకేదైన నాశ్చర్యము కలిగించిన యెడల హృదయములోనున్న విస్మయముపైకి రానీయకుము. భోజనమైనపిమ్మట జమిందారుడు తనలేబొరేటరీని చూడరమ్మని నిన్నుపిలుచును. ఏమియు సందేహపడక యతని వెంటపొమ్ము. అయితే ఏడవమెట్టును గురించి జాగ్రతపడుము."

తెలివిమాలినవాడనై యట్లు మృత్యువు నోటబడితిని కదాయని నన్ను నేను శపించుకొంటిని. ఒక పావుగంటసేపు నాశరీరము కొయ్యబారెను. పిమ్మట జాబును తీసికాల్చివేసి దాని భస్మమును పాదము క్రిందత్రొక్కి పెట్టితిని. ఎంతవిలపించినను జరుగవలసిన కార్యము జరుగక మానదు. మరణము [illegible]వలసిన యెడల పిరికివానివలెగాక ధైర్య సాహసములతో నే మృత్యుదేవత నెదుర్కొందునని దృఢపరచుకొంటిని.

భోజనము వేళకు వెంబడి నాకు మర్యాదలు సల్పిన సేవకుడు మరల విశ్వబ్ధముగావచ్చి నన్ను విందుశాలకు దోడ్కొనిపోయెను. అచ్చట జమీందారుడు నన్నెదుర్కొని నల్లని ముఖమల్ వస్త్రముల వలనను ప్రజ్వరిల్లుచున్న కెంపువజ్రాదులతోను మారొప్పొందిన దాదినినాకు “నాజమీందారిణి”యని ఇంట్రడ్యూస్ చేసెను.

“మనము చివరకు కలిసికొంటిమికదా! యని యూపెచెప్పెను. ఆస్వరము ఆచూపు, “తుదకునాచేత జిక్కితివికదా?” యనునట్లుండెను.

అచటనుండిన స్త్రీ పురుషు లందరు ధరించిన యమూల్యమైన వస్త్రములు, నగలు వారిని గంధర్వుల వలె నలంకరించెను. వీరందరితో నన్నుగూర్చి పొగడి నానిమిత్తమే యంతటి విందు జరుగుచున్నట్లు జమిందారుడనెను.

అతిసౌందర్యవతియగు ఓల్గా దేవతాస్త్రీవలె నాప్రక్కనే కూర్చుండియుండెను. ఆమెమాట ప్రకారము నేను మధురవాక్యములతో నామెను వరించువానివలె నామె దిక్కువరిగి యితరులకు వినబడి వినబడకుండునట్లు సంభాషించుచుంటిని. ఇదంతయు జమీందారుడును దాదియు కనిపెట్టుచుండిరి.

భోజనము ముగిసినపిదప నితరు లనేకవిధముల కాలమును గడుపుచుండిరి. జమీందారుడు తన లేబొరేటరిచూచుటకు నన్ను రమ్మనెను. నామరణము నెదుర్కొనుటకు మారు మాటాడక బయలుదేరి వెళ్లితిని. ఆభవనము నందొకచీకటిసొరంగమువలె నొకసందుండెను. ఓల్గా దీపము పట్టుకొని మాముందునడచుచుండెను. ఎంతోదూరము నడువగా నొక తలుపుదగ్గర నిలిచితిమి. జమీందారుడు నన్నులోనికితోడ్కొనిపోయి “చూచితిరా? నాలేబొరేటరి” యనెను. అది విశాలమైనగది. బీరువాలతోను, మందులతోను మరిసామానులతోను నిండియుండెను. అవియన్నియుచూచిన పిదప గదిలో నొక చివరయుండిన యొక మంచమును చూపెట్టెను.

“నేనొకప్పు డాసక్తితో పనిచేయునప్పుడు రాత్రులలో కాలమేలాగు పోవుచున్నదో యెరుగను. మధ్య రాత్రియందు నాపడక గదికి వెళ్లలేక నిచ్చటనే రాత్రి గడ్పుట కీపడకయున్న” దనెను.

నేను దాని సమీపముగాపోయి, యచ్చట నొక పెద్దకిటికీనుండి వెలుపలి యంధకారమును చూచితిని. నాగుండెలు ఝల్లుమనునట్లుగా నాకిటికీ క్రిందనుండి, నీవానదియొక్క నల్లనిప్రవాహము పొలుచుండెను. అటుతరువాత మేమందరమును మరల వెలుపలికివచ్చి చీకటిసందు చేరితిమి.

“ఇక నేను క్యాన్సర్ మైక్రోబ్లను కృషిచేయు చిన్న చీకటిగదిని చూతమురండి”యని జమిందారుడు ముందుకుసాగెను. అతని ముందుగుండ నడచుచున్న బాలిక వెనుకకు తిరిగి “పెద్దనాన్న నాకుభయమగుచున్నది. ఈలాంతరుతీసికొని మీరేముందు నడువండి” యనెను.

జమిందారు డామె భీతికి మందలించి యిష్టములేక లాంతరుపుచ్చుకొని వెంబట నడచెను. ఆ సందు చివర నొకతలుపు వచ్చెను. దానిని తెరచి “యిచ్చటినుండి దిగిపోవలె”నని చెప్పి జమిందారుడు ముందు దిగెను. ఓల్గా యాతని వెనుక దిగుచు “నొకటి, రెండు” యని బిగ్గరగా మెట్లను లెక్కించుచు నడుగులు వేయుచుండెను. “ఆరు” యని లెక్కింపగానే నన్ను వెనుకకు త్రోసెను. తత్క్షణమే నేదోయొక బరువైన వస్తువు జారి యఘాధములోనున్న నీటిలోపడినట్లు చప్పుడు వినవచ్చెను. ఆమె త్రోపుకు మెట్లమీదనే కూర్చుండబడితిని. జమిందారుడును బాలికయు నదృశ్యమైరి. చీకటి యంధకారమయముగా నుండెను. నాదేహమంతయు భయకంపితమయ్యెను.

“ఆహా! యేడవమెట్టులేనేలేదు. ఆరవమెట్టునుండి పాతాళములోనే తెలియనివారు దిగుదురు. అచ్చట చీకటిలో ప్రవహించు నీవానది నల్లనిప్రవాహములోపడి ప్రాణము విడుచుటయే వీరు శత్రువులకు విధించినదండన. అహా! యెంతఘోరమరణము నాకుతప్పె” ననుకొంటిని.

అయినను సంతసించుటకాస్పదములేదు. నేను సురక్షితముగా పోవుటకు మార్గమేది? 397 చేతులు చాచి యన్నిదిక్కులుతడివి యేదైనా మార్గమున్నదా యని వెతికితిని. మేము వచ్చిన తలుపు గట్టిగా బిగియబడి యుండెను. మరేదిక్కైనను తలుపులుండలేదు. సాపుగా గోడయుండెను. నాతోవచ్చిన వారిరువురు

మరల మెట్లనెక్కలేదు. వారెటునుండి, యేరహస్యపు దారినుండి వెళ్లిపోయియుండురాయని విస్మయముచెంది తిని. చివరకు నీటిలో నాకు చావుతప్పినను క్షుద్రిపాసములవలన నీస్థలమందే నేను జీవములు విడుతునుకదా యని దుఃఖించుచుంటిని.

ఇట్లుండగా నెవరో మాట్లాడునట్లు నాకు సమీపముగానే ధ్వని వినవచ్చెను. జమిందారుడు మరల నేనున్నస్థలమునకువచ్చి నేనేవిధమునైనను తప్పించుకొని యుండినయెడల కడదేర్పవలెనని కాబోలు యుద్దేశమును తెల్పుచుండెను. ఓల్గా యతడట్లు చేయకుండునట్లు ప్రత్యుత్తరములు చెప్పుచుండెను.

"అంత పెద్దచప్పుడు గుండెలు ఝల్లుమనునట్లు మీరు, నేను వింటిమికదా యేమిటీ వెఱ్ఱిమీరు" అని ఓల్గా అనెను.

అధ్వనులాగిపోయెను. మాట్లాడినవారు వెళ్లిపోయిరి. అటుతరువాత కొంతసేపటికి నారవమెట్టు ప్రక్కన గోడవలెనుండినది. నిజముగా తలుపైయుండుటచేత దానిని తెరచి ఓల్గా గుమ్మమునద్ద నిలువబడెను. చేతి సంజ్ఞచేసి తన వెంటరమ్మనెను. నేను వెళ్లితిని. మేము కొంతదూరము వెళ్లి మెట్లుదిగితిమి. చివరకు నదియొద్దు వచ్చెను.

"ధైర్యచిత్తుడైన యాంగ్లేయుడా నాప్రాణము నాచేతిలోపెట్టుకొని నిన్ను తప్పించితిని. ఆరవమెట్టు నుండి నీవు నదియందే పడి యుందువు. నేనెంతో శ్రమతోను, సాహసముతోను యితరులకు తెలియకుండ నొకరాళ్లబస్తా నచ్చటనుంచి నిన్ను వెనుకకు త్రోయుచు కాలితో నాబస్తాను నీటిలో పడవేసితిని. జమిందారుడు నీవేపడిపోయినావని నమ్మెను. ఇక నీవు నీపడవకు సురక్షితముగా వెళ్లు" మని నన్ను వీడుకొల్పి తనలాంతరుపట్టుకొని వెళ్లిపోయెను.

—(డాక్టరు క్లిఫర్డు హాలిఫాక్సు వారి Extracts from a Doctor's Diary అను గ్రంథములోని 'The Seventh Step' అనుకథకు అనువాదము.)

చిత్రప్రశ్న

శ్రీమతి మొగసాటి అప్పలనరసమ్మగారు

౧

మొదటి రెండక్షరములు చేర్చగా 'చూచి' యనుటకర్థంబగు; ఆదితుదను
గలిగిన యక్షరములుగల్పి చదువగాదంతావళమున కర్థంబుదోచు;
పరికింప చివరయక్షరములు రెండును కొండకర్థంబుగా నుండియుండు;
మూడవయక్షరమును మాని చదివిన 'చూచిరి' యనసరిదోచు; మొత్త

మునను నాల్గక్షరంబులు బొందుపఱుప
గ్రామనామంబు నెల్లూరు సీమలోన—
తెలుపుడీ దీని నామంబు తెలివలార!
మీదు బుద్ధి పరీక్షింప మీటయిదియె.

☞ ఇట్టివానియందు రుచిగల 'గృహలక్ష్మి' చందాదారులాంధ్రు ఈ ప్రశ్నకు జవాబు స్వయముగ నాలోచించి మాకు లేఖాముఖమున మే 10-వ తేదీలోపున తెలుపుదురుగాక! లేఖలో తమచందా నెంబరు తప్పక తెలుపవలెను.

398